క్లుప్తంగా

ఉచిత మెగా వైద్య శిబిరం



వైద్య శిబిరంలో సేవలందిస్తున్న సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: స్థానిక ఆర్యవైశ్య సంఘ కార్యాలయంలో సాయి సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం శిబిరానికి హాజరైన రోగులకు వైద్యులు వివిధ పరీక్షలు చేసి, వారికి ఉచితంగా మందులు అందజేశారు. 30 ఏళ్లుగా ప్రజలకు ఈ రకంగా సేవలందిస్తుండడం అభినందనీయమని, ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని శ్రావణి కోరారు. కార్యక్రమంలో వైద్యులు శ్రీరామ్మూర్తి, సింధూరి, కస్పా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారిణి నీలిమ

పూసపాటిరేగ: వరి సాగులో యాజమాన్య పద్ధతులు అవలంబిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారిణి కె.నీలిమ తెలిపారు. మండలంలోని కొప్పెర్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వరి పంట పండించేటప్పుడు నీటి యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు సక్రమంగా పాటించినట్లయితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి వేణుగోపాల్

నెల్లిమర్ల: జిల్లాలోని నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుదామని వయోజన విద్య(అడల్ట్ ఎడ్యుకేషన్) జిల్లా నోడల్ అధికారి ఎ.వేణుగోపాల్ పిలుపునిచ్చారు. స్థానిక వెలుగు కార్యాలయంలో అక్షర ఆంధ్ర ఉల్లాస్ ఫేస్–2పై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,10,915 మంది నిరక్షరాస్యులున్నారని, వారందరినీ అక్షరాస్యులుగా మలచాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లోకి చేపపిల్లల విడుదల

విజయనగరం: దోమల నియంత్రణ చర్యల్లో భాగంగా నగరంలోని చెరువుల్లోకి గంబూషియా చేపపిల్లలు మంగళవారం విడుదల చేశారు. కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, మలేరియా నివారణ అధికారి వై.మణిలు చేపపిల్లలను చెరువుల్లోకి విడిచిపెట్టారు. మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా తదితర వ్యాధులకు కారణమైన దోమలు వృద్ధి చెందకుండా ఈ చర్యలు చేపడుతున్నామని, ఇప్పటికే చెరువులు, కుంటలు, నీటి నిల్వ ప్రాంతాల్లోకి ఆయిల్ బాల్స్ కూడా విడిచిపెట్టడం జరిగిందని వారు తెలిపారు. అలాగే ప్రతిరోజూ దోమల నియంత్రణకు ఫాగింగ్ చేస్తున్నామన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కొత్తగా ఎన్నికైన ప్రెస్‌క్లబ్ సభ్యులు వీరే..

భోగాపురం: మండల కేంద్రంలో భోగాపురం ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక మంగళవారం జరిగింది. ఎన్నికల అధికారిగా సవరవిల్లి శంకరరావు వ్యవహరించగా క్లబ్ గౌరవాధ్యక్షుడిగా ఎం.కుశరాజు, అధ్యక్షుడిగా వై.శ్రీనివాసరావు, కార్యదర్శిగా ఎ.రమణ, ఉపాధ్యక్షుడిగా ఆర్.రాజు, జాయింట్ సెక్రటరీగా ఎం.రవికుమార్, కోశాధికారిగా పి.రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కూటమిది ప్రచారార్భాటం

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో కూటమి పాలనపై వైఎస్సార్ సీపీ నాయకుల మండిపాటు



తొమ్మిదో డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానిది అంతా ప్రచారార్భాటమే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా నగరంలోని 11వ డివిజన్‌లో మంగళవారం పర్యటించిన వారు ఇంటింటికీ వెళ్లి, చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. ఎలాగైనా అధికారాన్ని చేజిక్కించుకోవాలన్న ఆశతో ఎన్నికలప్పుడు లెక్కలేనన్ని హామీలిచ్చి ప్రజలను ఊదరగొట్టారన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు అమలు చేయాలని నిలదీస్తే కేసులు పెడతారా అని ప్రశ్నించారు. గద్దెనెక్కి 14 నెలల కాలం దాటుతున్నా ఎన్నికల హామీలన్నీ ఎందుకు అమలు చేయలేకపోయారో చెప్పగలరా అని నిలదీశారు. గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన వాటికి రెండింతలు ఎక్కువ పథకాలు ఇస్తానని చెప్పి ఇప్పుడు చేతులెత్తేయడం ఎంతవరకు సమంజసమన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500, ఉచిత బస్సు ప్రయాణం, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ వంటి పథకాలు ఎప్పుడు అమలు చేస్తారన్నారు. ఇప్పటివరకు ఇచ్చిన గ్యాస్, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాల్లోనూ ప్రజలకు మోసమే చేశారన్నారు. మొదటి ఏడాది గ్యాస్ సిలిండర్లు ఎగ్గొట్టమే కాకుండా ఎన్నికల సమయంలో ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు అని చెప్పి మూడు ఇస్తామనడం మోసం కాదా అని అన్నారు. తల్లికి వందనం డబ్బులు రూ.15 వేలు అని చెప్పి ఒక్కొక్కరికి ఒక్కో విధంగా డబ్బులు వేసిన మాట వాస్తవం కాదా అని ధ్వజమెత్తారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు కేవలం రూ.14 వేలు అది కూడా విడతల వారీగా ఇస్తామనడం వంచన చేయడం కాదా అని దుయ్యబట్టారు. ఎన్నికల హామీలన్నీ అమలు చేయాలని లేకుంటే ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సయ్యద్ గౌస్, మహిళా నాయకులు ఉషారాణి, అనూష, నందిని, జ్యోతి, సుజాత, ఉష, పరమేశ్వరి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలు చంద్రబాబుకు అలవాటు..

నగరంలోని 16, 17, 21వ డివిజన్‌లలో జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టి వీరవెంకటరాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంగంరెడ్డి బంగారునాయుడులు పాల్గొని, చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఎన్నికలప్పుడు అబద్ధాలు, మోసాలతో చంద్రబాబు ప్రచారం చేస్తారని, అవి నమ్మితే ఇప్పుడు మోసపోయినట్లు మోసపోవడం ఖాయమన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదికే అన్ని పథకాలు అమలు చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం అధికారం చేపట్టి 14 నెలలు దాటుతున్నా పథకాల అమలు తీవ్ర జాప్యం చేస్తూ నమ్మిన ఓటర్లను మోసం చేస్తోందని దుయ్యబట్టారు. ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమని, అలాంటి నాయకులను మరోసారి నమ్మవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు ఆశపు సుజాత, కనకల నాగవల్లి, గుజ్జల నారాయణరావు, అల్లు చాణక్య, నాయకులు అవనాపు లక్ష్మణరావు, బోడసింగి ఈశ్వరరావు, బొంగ భానుమూర్తి, కాళ్ల సూరిబాబు, పిన్నింటి సూర్యనారాయణ, కనకల గిరి తదితరులు పాల్గొన్నారు.



17వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ బ్రోచర్లు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

స్మార్ట్‌మీటర్లు మాకొద్దు 'బాబు'



విజయనగరం టౌన్: విద్యుత్ స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎంఎల్) నాయకుల ర్యాలీ



నెల్లిమర్ల: నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నెల్లిమర్ల: విద్యుత్ స్మార్ట్‌మీటర్లు వద్దని డిమాండ్ చేస్తూ స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఆ పార్టీ నాయకుడు కిల్లంపల్లి రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లు బిగించి వినియోగదారులపై విద్యుత్ భారం మోపాలని చూస్తుండడం అన్యాయమన్నారు. ఇప్పటికే విద్యుత్ సర్దుబాటు చార్జీలు, ట్రూఅప్ చార్జీల పేరిట పెనుభారం మోపారని, మళ్లీ స్మార్ట్‌మీటర్లతో ఇంకెంత దోచుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రజలపై కరెంట్ భారం పడకుండా చూడాలని పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించడంతో పాటు స్మార్ట్‌మీటర్లను బిగించవద్దని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొండల కరువులు, జగ్గిన్ని సత్యారావు, మన్యపురి సన్యాసిరావు, మద్దిల కృష్ణ, కె.రమణ, సీపీఐ నాయకులు ఎం.పాపారావు, న్యూ డెమోక్రసీ నాయకులు కె.అప్పలసూరి, కాంగ్రెస్ నాయకుడు కె.పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్: విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకుడు రెడ్డి నారాయణరావు, ఆ పార్టీ నాయకులంతా కలిసి స్థానిక ప్రకాశం పార్కు నుంచి గంటస్తంభం వరకు నిరసన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. అదానీ స్మార్ట్‌మీటర్లు వద్దు..పాతమీటర్లే ముద్దు అని నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం ప్రతి ఇంటికి బిగించాలని చూస్తున్న స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ధర్మారావు, సీతారామం, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



పూసపాటిరేగ: స్మార్ట్‌మీటర్లు వద్దు..పాతమీటర్లు ముద్దు అని నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు, తదితరులు

పూసపాటిరేగ: విద్యుత్ స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ పూసపాటిరేగ మండలం, కొప్పెర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే కూటమి నాయకులు స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించి, ఇప్పుడు తెస్తుండడం దుర్మార్గమన్నారు. కార్పొరేట్‌లను పెంచి పోషించేందుకే కూటమి స్మార్ట్‌మీటర్లను తీసుకువస్తోందని, దీనిని మనమంతా ఖండించాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు ఉంటే రీడింగ్ వారి చేతుల్లోనే ఉంటుందని, ఎక్కువ యూనిట్లు విద్యుత్ వినియోగించినట్లు చూపించి, ఆ తర్వాత పథకాలు, రేషన్‌కార్డు తీసేస్తారని, ఈ మోసాన్ని ప్రజలంతా గమనించాలని కోరారు. రీచార్జ్ చేసుకోకుంటే కరెంట్ ఉండదన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం సభ్యుడు బి.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం తగదు



విజయనగరం అర్బన్: కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

విజయనగరం అర్బన్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం ఎంతమాత్రం తగదని ఏపీ యూడబ్ల్యూజే జిల్లా కమిటీ నాయకులు శివప్రసాద్, రాజు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టు డే పురస్కరించుకుని స్థానిక కలెక్టరేట్ ప్రాంగణం నుంచి ర్యాలీగా బయలుదేరి మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట నిల్చొని మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. అక్రిడేషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం కొత్త నిబంధనలను తీసుకురావడానికి మంత్రులతో కూడిన కమిటీ ఏర్పాటు చేసినప్పటికీ ఇంతవరకు ఒక సమావేశం కూడా జరగలేదన్నారు. ఈ అలక్ష్యం వల్ల అనేక మంది జర్నలిస్టులు అక్రిడేషన్లు పొందే అవకాశం లేకుండా పోతుందన్నారు. జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్న యాజమాన్యాల మీద చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం జర్నలిస్టులను ఇబ్బందులకు గురిచేసేందుకు సిద్ధపడడం చాలా బాధాకరమన్నారు. జర్నలిస్టులకు నష్టం కలిగించే అడ్డుగోలు నిబంధనలకు ఆస్కారం ఇవ్వకుండా నిబంధనలు రూపొందించాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర నాయకుడు పీఎస్ఎస్‌వీ శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి ఎంఎస్ఎన్ రాజు, సీనియర్ పాత్రికేయులు ఎలిశెట్టి సురేష్, పంచాది అప్పారావు, మహాపాత్రో, లక్ష్మణరావు, శేషగిరి, రాము, సుబ్బయ్య పంతులు, సత్యనారాయణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వాలి

భోగాపురం: జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇవ్వడంతో పాటు, బీమా సదుపాయం కల్పించాలని స్థానిక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు కోరుతున్నారు. ఇదే విషయమై వారు మండలంలోని ముంజేరు జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన ప్రకారం ప్రతి జర్నలిస్టుకూ ఇళ్లస్థలం అందివ్వాలని అలాగే అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసి, తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘం నాయకులు ఎం.కుశరాజు, వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రండి.. టీ తాగుతూ మట్లాడుకుందాం!



ఉద్యోగుల సమస్యలపై మాట్లాడుతున్న ఏపీజీఈఏ నెల్లిమర్ల తాలూకా అధ్యక్షుడు వీరన్నదొర

నెల్లిమర్ల: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) డిమాండ్ చేసింది. ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ పిలుపు మేరకు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో రండి..టీ తాగుతూ మాట్లాడుకుందాం అనే కార్యక్రమం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. సంఘ నెల్లిమర్ల తాలూకా అధ్యక్షుడు పి.వీరన్నదొర మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన రూ.25 వేల డీఏ, ఎస్ఎల్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. పీఆర్సీ కమిషన్ నియామకం వెంటనే చేపట్టాలని, సీపీఎస్ రద్దు చేయాలని కోరారు. అలాగే ఉద్యోగులపై యాప్‌ల భారం తగ్గించాలని, రిటైర్డ్ ఉద్యోగుల ఈఈఎల్, గ్రాట్యుటీ చెల్లింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సహాధ్యక్షుడు చక్రవర్తి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కార్యదర్శి పతివాడ త్రినాథ్, ఎంఈవోలు సూర్యనారాయణమూర్తి, జ్ఞానశంకర్, ఎస్టీవో వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పౌరసత్వ చట్టాన్ని వ్యతిరేకించాలి



ఐక్యత చాటుతున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

విజయనగరం గంటస్తంభం: జాతీయ పౌరసత్వ చట్టాన్ని వ్యతిరేకించాలని సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ బుగత బంగారురావు పిలుపునిచ్చారు. గతంలో సీపీఐ(ఎంఎల్)లో పనిచేసిన బి.శంకరరావు, ఎం.అప్పలరాజు, బి.గిరిప్రసాద్ సహా మరో 50 మంది ఇతర కార్మిక, ప్రజా సంఘాల నాయకులంతా సీపీఐ(ఎంఎల్)లో చేరారు. ఈ మేరకు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన ఫాసిస్ట్ అజెండాను దేశంపై రుద్దుతోందని విమర్శించారు. అస్సాంలో చేసిన పౌరసత్వ చట్టాన్ని దేశమంతా దొడ్డిదారిన అమలు చేసేందుకు ప్రయత్నిస్తోందని, దానిలో భాగమే బీహార్‌లో ఎన్నికలు దగ్గరికి వచ్చిన తర్వాత ఓటర్ల పేరిట ప్రతిపక్షాలకు చెందిన 64 లక్షల మందిని తీసివేయడం జరిగిందని తెలిపారు. ఆ సర్వేలో తొలగించిన ఓటర్లు బీహార్‌లో 15 శాతంగా ఉందని, ఇది దురుద్దేశంతో కూడిన సర్వే అని బంగారురావు ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన ఆధార్ కార్డు, రేషన్‌కార్డు ఓటరు గుర్తింపుకార్డు ప్రామాణికం కాదన్నారు. రాజ్యాంగ సంస్థలను బీజేపీ విచ్ఛిన్నం చేస్తోందన్నారు. మరోవైపు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందని, ఎన్నికల హామీలన్నీ అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని ధ్వజమెత్తారు. అభివృద్ధి పేరిట నిధులన్నింటినీ అమరావతి అనే ఒక్క ప్రాంతంలోనే పెడుతోందని ఇలా అయితే వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి ఎలా అని ప్రశ్నించారు. రెడ్‌బుక్ పేరిట రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తున్నారని, ఇది సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) నాయకులు బెహరా శంకరరావు, అప్పలరాజు, గిరిప్రసాద్, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రమాణ స్వీకార మహోత్సవం



విజయనగరం ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ సభ్యులు

విజయనగరం టౌన్: స్థానిక ఎస్‌వీఎన్ లేక్ ప్యాలెస్‌లో విజయనగరం ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి హాజరై, కాసేపు మాట్లాడారు. సమాజ సేవలో ఆర్యవైశ్యుల పాత్ర కీలకమైందని, వందేళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతుండడం అభినందనీయమన్నారు. అనాదిగా వస్తున్న ఈ గౌరవాన్ని కాపాడుకుంటూ ఆర్యవైశ్యులు ఎల్లప్పుడూ తమ సహాయ సహకారాలు అందించాలని, దీనికి తమ సహకారం కూడా ఉంటుందన్నారు. అనంతరం బియ్యం పంపిణీకి రూ.లక్ష విరాళం ప్రకటించారు. కొత్తగా ఎన్నికైన సంఘ సభ్యులకు తన అభినందనలన్నారు. ఆ తర్వాత కమిటీ అధ్యక్షుడిగా రవ్వా శ్రీనివాస్, కార్యదర్శిగా కాపుగంటి రవి, కోశాధికారిగా అరిశెట్టి వేణుగోపాల్‌లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో న్యాయవాది బొడ్డు సత్యనారాయణ, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

నెల్లిమర్ల రూరల్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీసీతారామస్వామి దేవస్థానంలో కొలువుదీరిన ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతఃకాలార్చన చేసినానంతరం పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పండ్ల రసాలతో అభిషేకం చేశారు. అనంతరం నూతన వస్త్రాలు, రకరకాల పుష్పాలతో స్వామిని అత్యంత సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించాలన్నారు. ఆ తర్వాత భక్తులు హనుమాన్ చాలీసాను భక్తిశ్రద్ధలతో పఠించారు.

గర్భిణులకు సీమంతం

నెల్లిమర్ల: తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని, ప్రతి తల్లి తన బిడ్డకు కనీసం ఆరు నెలల పాటు ఇవ్వాలని నగరపంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని తెలిపారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఐదో నంబర్ సచివాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతం మంగళవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్‌పర్సన్ హాజరై గర్భిణులకు సీమంతం చేసి, ఆశీర్వదించారు. అనంతరం బిడ్డకు తల్లిపాలు ఆవశ్యకతను వివరించారు. తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, ప్రతి బిడ్డకు తల్లిపాలే ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బూర సుజాత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.త్రినాధమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పి.మంగలక్ష్మి, చిట్టితల్లి, దుర్గాభవాని, జగదాంబ, పుష్ప, మహాలక్ష్మి, దివ్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు ఏర్పాటుకు చర్యలు

భోగాపురం: మండలంలోని సవరవల్లిలో తాగునీటి బోరు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ ఉప్పాడ విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. మంగళవారం బోరు వేసేందుకు రిగ్గింగ్ పనులు చేపట్టామన్నారు. ఎంపీపీ ఉప్పాడ అనూషరెడ్డి సహకారంతో ఎస్సీ కాలనీలో ఇప్పటికే ఓ తాగునీటి బోరు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పుడు మరో బోరు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పట్నాన తాతయ్యలు, వైఎస్సార్ సీపీ నాయకులు పూసర్ల వెంకటరమణ, కోచెర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పౌరసేవలు సులభంగా అందించేందుకే వాట్సాప్ గవర్నెన్స్

విజయగనరం: పౌరసేవలు సులభంగా అందించేందుకే వాట్సాప్ గవర్నెన్స్ అమలు చేస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ సేవల కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన మనమిత్ర యాప్‌పై అవగాహన కల్పిస్తూ మంగళవారం నగరంలో ర్యాలీ చేపట్టారు. గంటస్తంభం నుంచి కోడిరామ్మూర్తి వ్యాయామ శాల వరకు జరిగిన ఈ ర్యాలీలో ఆయన పాల్గొని, కాసేపు మాట్లాడారు. 95523 00009 అనే నంబర్‌ను ఫోన్‌లో సేవ్ చేసుకుని, హాయ్ అని మెసేజ్ పెడితే ప్రభుత్వం అందిస్తున్న సేవల వివరాలు వస్తాయన్నారు. ఆ ప్రకారం మనం సేవలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కె.అప్పలరాజు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

12న జాతీయ నులిపురుగుల దినోత్సవం

పూసపాటిరేగ: జాతీయ నులిపురుగుల దినోత్సవం ఈ నెల 12వ తేదీన నిర్వహిస్తున్నామని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారిణి భాగ్యరేఖ సూచించారు. మండలంలోని రెల్లివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామీణులు అనారోగ్యం బారినపడకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు వారికి ఆరోగ్య సలహాలు, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలు తెలియజేయాలన్నారు. బాలింతలకు బిడ్డకు తల్లిపాలు ఆవశ్యకతను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.